ఆంధ్రభూమి సచిత్ర వారపత్రిక: 22.4.1982

# లోటు

"హలో..."

సుందరి చేస్తున్న పని ఆపి తలెత్తి చూసింది. ఎదురుగా తెలిసిన మొహమే! అయినా చప్పున పేరూ, పరిచయము గుర్తురాలేదు.

"కూర్చోండి" స్టూలు జరిపింది.

అగంతకుడు కూర్చున్నాడు, నవ్వుతూ సుందరినే చూస్తూ.

'ఎవరితను?' కొన్ని క్షణాలు ఆలోచించింది.

"నేను... రాజేశ్వరరావును."

సుందరి క్షణం విస్తుపోయింది. రాజేశ్వరరావును చూసి ఆ తర్వాత నొచ్చుకుంది. అతని రూపాన్నీ, మాటను మర్చిపోయినందుకు.

"క్షమించండి!" అంది. అనీ, "చాలా రోజులైంది గదా!" అన్నది సంజాయిషీగా.

రాజేశ్వరరావు సిగరెట్ వెలిగించుకున్నాడు.

సుందరి రాజేశ్వరరావునే చూస్తూ, "ఎప్పుడొచ్చారు?" అనడిగింది.

"వచ్చి వారం రోజులైంది. కానీ నీ అడ్రసు తెలియలేదు. ఓ మిత్రుడి గదిలో వుంటు న్నాను. నిన్న సాయంత్రం, ఈ ఆఫీసులోంచి వస్తుంటే చూశాను. అప్పుడే పలకరిద్దామను కున్నాగానీ.." రాజేశ్వరరావు చెప్పడం, ఆపి సుందరి కళ్ళల్లో చూసి, తలొంచుకుని "కార్లో వెళ్ళిపోతున్నావు" అన్నాడు.

సుందరి మాట్లాడలేదు.

బెల్ నొక్కింది. ప్యూన్ వచ్చాడు.

"ఏం తీసుకుంటారూ?"

'కాఫీ' అని చెప్పబోయి, ఆకలి గుర్తొచ్చి "నీ యిష్టం" అన్నాడు.

"కూల్‌డ్రింక్స్" సుందరి చెప్పేసింది!

ఖాళీ సిగరెట్ పెట్టె క్రింద పారేశాడు, రాజేశ్వరరావు కావాలనే, సుందరి చూడాలని. సుందరి చూసింది. చూసి, "అది చెత్తకుండిలో వేయండి" అన్నది.

"మీరు, బయట విజిటర్స్ రూంలో కూర్చోండి. నాకో గంట పనుంది!"

రాజేశ్వరరావు అయిష్టంగా లేచాడు. వెళ్తూ ఆగి, "నీతో తీరిగ్గా మాట్లాడాలి?"

"అలాగే సాయంత్రం" సుందరి చూస్తున్న ఫైల్లోంచి తలెత్తకుండా సమాధానమిచ్చింది.

రాజేశ్వరరావు, వెళ్ళాక నిట్టూర్చింది! టేబుల్ మీది ఫైళ్ళు సర్దేసి, వెళ్ళి పడక్కుర్చీలో జారగిలబడ్డది, ఆలోచిస్తూ.

రాజేశ్వరరావు పని కట్టుకుని వచ్చి మాట్లాడాలని అన్నాడంటే, ఏదో వుందన్నమాటే? ఏం మాట్లాడతాడు?

సుందరికి అర్థం గాలేదు.

ఫ్యూను డ్రింక్స్ తెచ్చాడు.

"చూడు, ఇందాక ఇక్కడ కూర్చున్నాడే అతను, బయట విజిటర్స్ రూంలో వుంటాడు. అతనికోటియ్యి"

ఫ్యూన్ వెళ్ళాక, కళ్ళు మూసుకు పడుకుంది.

రాజేశ్వరరావు డ్రింక్ తాగాడు. తాగి ఫ్యూనును అడిగాడు.

"మీ అమ్మగారేం చేస్తున్నారూ?"

"ఎనక గదిలో పడుకున్నదయ్యా?"

రాజేశ్వరరావు నవ్వుకున్నాడు. తనొచ్చిన పని విజయవంతం అవుతుంది. అందుకు ఇది శుభసూచకం.

సుందరి, ఇదివరకటి కన్నా బాగుంది. పీలగా, ఎర్రగా, మౌనంగా వుండే సుందరి! ఇప్పుడు వళ్ళు చేసింది, ముహంలో నిండుతనం ఉంది. క్రొత్తగా వచ్చిన కళ్ళజోడు, చుట్టుకున్న కొప్పు క్రొత్త అందాన్ని కలుగచేశాయి సుందరికి. ఇవన్నీ కాక, కూర్చున్న కుర్చీ, హోదా, ఆర్థికంగా స్థిరత్వం కలగటం వల్ల, సుందరి అరిందాగా తయారైంది అని అనుకున్నాడు రాజేశ్వరరావు.

సిగరెట్లు అయిపోయాయి. జేబులో డబ్బులూ లేవు. కొత్త ప్రదేశం. ఏం చేయాలో తోచలేదు. నోరు తెరిచి సుందరిని అడుగుదామా అనుకున్నాడు. కానీ సందేహం వచ్చింది. తనొచ్చిన పని మొదలుకే మోసం వస్తుందేమోనన్న అనుమానమే గాక భయమూ వేసింది. ఐదెప్పుడవుతుందా, అని గడియారం వేపు చూస్తూ కూర్చున్నాడు.

సుందరి గదిలోంచి, డోర్‌బెల్ మ్రోగినప్పుడల్లా ఆశగా చూశాడు, సుందరి పిలుపు కోసం. ఊహూ పిలుపు రాలేదు.

అంతేగాదు ఆఖరికి సుందరి వెళ్తూ కూడా రాజేశ్వరరావు వేపు చూడలేదు. మెట్లు దిగి మహారాణీలా వెళ్ళింది.

రాజేశ్వరరావు ఫ్యూను వెంట క్రిందకెళ్ళాడు. సుందరి ఫ్రంట్ సీట్లో కూర్చుంది. డిక్కీలో ఫైళ్ళు సర్దేశాడు ఫ్యూను. అదిగో అప్పుడు, వెనక్కు తిరిగి సుందరి, రాజేశ్వరరావును

అడిగింది - "వస్తారా?" అని.

రాజేశ్వరరావు కారెక్కాడు, క్షణం ఆగితే అవకాశం జారిపోతుందేమోనని, ప్యూను ప్రక్కన కూర్చున్నాడు.

దారిలో కారు మార్కెట్లో ఆగింది. ఆపిల్స్, ఎగ్స్, బ్రెడ్, కూరలు, ప్యూన్ కొనితెచ్చాడు.

కారు, బంగళాకు చేరేసరికి, ఓ బాబు బంతితో ఆడుతున్న వాడల్లా పరిగెత్తుకువచ్చి "మమ్మీ" అని సుందరిని వాటేసుకున్నాడు.

సుందరి ఆఫీసరు హోదా మర్చిపోయి బాబు నెత్తుకుని, లోపలకు వెళ్ళిపోయింది.

ప్యూను ఫైళ్ళూ, మార్కెట్‌లో కొన్న పళ్ళబుట్ట లోపలకు తీసుకువెళ్ళాడు.

రాజేశ్వరరావు బంగళా ముందు నిలబడ్డాడు. ఏడుపొచ్చింది. నిబ్బరించుకున్నాడు. నిలబడ్డాడు - అభిమానం చంపుకుని, భవిష్యత్తుని ఊహించుకుని.

ఆ తర్వాత ఎప్పటికో ప్యూన్ వచ్చి, "అమ్మగారు, మిమ్మల్ని లోపలకొచ్చి కూర్చో మన్నారు' అని చెప్పాడు.

రాజేశ్వరరావు వెళ్ళి సోఫాలో చతికిలబడ్డాడు. కాఫీ వచ్చింది. త్రాగాడు. ఆ తర్వాత సిగరెట్ పెట్టె, యాష్ ట్రే కూడా వచ్చాయి కానీ సుందరి జాడ లేదు.

కాలం గడుస్తూనే ఉంది.

అన్నానికి పిలుపొచ్చింది. వెళ్ళి తిన్నాడు - వంట మనిషి వడ్డించగా.

రాజేశ్వరరావు ఆలోచనలో పడ్డాడు. తనొచ్చింది ఈ తిండికీ, సిగరెట్ల కోసమా? సుందరి తననిలా పట్టించుకోకుండా, తిరగటంలో అంతరార్థమేమిటి?

ఏమీ పాలుపోలేదు? ప్రశ్నలే తప్ప సమాధానాలు లభించలేదు.

తెగించి, రాత్రి తొమ్మిదింటికి మేడమీది కెళ్ళాడు.

సుందరి బెడ్ మీద పడుకుని, ఇంగ్లీషు నవల చదువుతూంది. ప్రక్కన బాబు, ఆమె మీద కాలేసి నిద్రపోతున్నాడు. ప్రక్కనే టీపాయ్ మీద గల టేప్ రికార్డర్‌లోంచి మృదువుగా, చిన్నగా పాట వస్తున్నది.

రాజేశ్వరరావు దగ్గాడు తనొచ్చినట్లు తెలియజేస్తూ.

సుందరి తలెత్తి చూసింది, ఏం కావాలన్నట్లు?

"నీతో మాట్లాడాలి?"

క్షణంపాటు నిశ్శబ్దం.

రాజేశ్వరరావు నిలబడే వున్నాడు.

సుందరి, బెడ్ మీద పడుకునే వుంది.

"అంత అర్జంటా?"

రాజేశ్వరరావు మాట్లాడలేదు.

"రెండు రోజులుండండి."

సుందరి పుస్తకంలోకి చూపు మరల్చుకుంది. రాజేశ్వరరావు తిరిగొచ్చాడు తల వంచుకునే.

♦ ♦ ♦

తెల్లవారింది.

రాజేశ్వరరావు నిద్ర లేచేసరికి, సుందరి లేదు.

"క్యాంపు కెళ్ళింది" అని చెప్పాడు ప్యూను.

రాజేశ్వరరావు ఏం చెయ్యాలో దిక్కుతోచక కూర్చుంటే ప్యూన్ చెప్పాడు - "అమ్మగారు మీకేం కావాలన్నా నన్ను చూడమన్నార్నారు" అని.

స్నానం చేశాడు. భోజనం చేశాడు. పేపరు చదివాడు. ఇంకే చెయ్యాలో తోచలేదు. గుర్రాలు మూసినాయి. డబ్బులేవు. ఎలా?

మధ్యాహ్నం దాటాక మధు వచ్చాడు స్కూటర్ మీద వచ్చి, "నా పేరు మధండీ. సుందరీ మాడం ఫ్రెండును. ఆవిడ క్యాంపు కెడుతూ, మీ సంగతి చూడమని చెప్పారు?" అన్నాడు.

సుందరి, తనను నిరాదరణ చెయ్యడం లేదు అన్న భావన రాజేశ్వరరావుకు తృప్తి నిచ్చింది. హుషారొచ్చింది. మధుతో మాటలు కలిపాక.

"మీ అమ్మగారి భర్త కనపడరే? ఒక్కతే వుంటోందా?"

మధు నవ్వాడు - "గురూగారూ! మంచి విషయం ఎత్తారు అదో పెద్ద కథ మీరు వింటానంటే చెబుతాను."

"చెప్పండి!"

"ఇలాంటి కథలు చెప్పుకోవాలంటే మందు వుండాలి. మీరు మందు కొడతానంటే తెప్పించుకుందాము. అది తాగుతూ, కథలు చెప్పుకుందాము! ఏమంటారు?"

రాజేశ్వరరావు ఎగిరి గంతేశాడు.

మందొచ్చింది. రాజేశ్వరరావు తాగుతున్నాడు. మందూ, సిగరెట్లు.

మధు చెబుతున్నాడు సుందరి కథ.

"గురూగారూ! సుందరికి అందముందండీ. చదువు కూడా వుందండీ. కనుక పెళ్ళయిందండి ఎవరితోటి, ఓ లక్షాధికారి ఏకైక పుత్రుడితో. అతగాడికండీ ఆరడుగుల దేహం, అస్థిదారసత్వం, వయస్సున్న కన్నెపిల్లలతో స్నేహం డబ్బున్న వాళ్ళకుండే అహంకారం వున్నాయండీ. అయితే అతగాడు అంతగా చదువుకోలేదండీ. చదువెందుకండీ. ఉద్యోగాలు చెయ్యాలా ఊళ్ళేలాలా అన్న ధీమా వుంది కదండీ అందుకని చదువు వంటబట్టలేదండీ.

అయితే ఒక్కడో ప్రశ్న.... మీరడగబొయ్యేదే నేచెబుతున్నానండీ.

ఏమ్మే చదువున ఆడపిల్ల, అందమున్న ఆడపిల్ల అతగాడిని ఎందుకు పెళ్ళాడిందీ?

అనే గదండీ.

ఈ దేశంలోనండీ ఆడదెంత చదువుకున్నా ఓ మొగాడి భార్య కావాల్సిందేనండీ. అది రూలు! పిల్లల్ని కనాలి. భర్తనేవాడు త్రాగినా, పెళ్ళాం ముందే మరో ఆడదానితో కులికినా తప్పు లేదండి. కట్టుకున్న పెళ్ళాం నోరెత్తగూడదు. తంతే తన్నులు తినాలి. వంట చెయ్యాలి. భర్తకు పాదదాసిగా మెలగాలి. అది రివాజు. లేకపోతే దేశం ఊరుకోదండీ. మొగుడు విడిచిన... ఇలా రకరకాలుగా అంటారండీ - సీతనీ, సావిత్రినీ సాక్ష్యానికి పిలుస్తారండీ.

కనుక సుందరి పెళ్లికి వప్పుకుంది. పుస్తెల తాడు కట్టించుకుని. మొగుడితో కాపురం చేసిందండీ.

అయితే... మీరు మాట్లాడకండి. మందు కొడుతూ వుండండి. నన్ను చెప్పనీయండి.

సుందరి మొగుడు చెడ్డవాడేం కాదండి. పేకాడతాడు. మందు కొడతాడు. ముండలతో కులుకుతాడు. ఇచ్ఛ కలిగితే పెళ్ళాన్ని బలవంతాన్నైనా పక్కలోకి లాక్కుంటాడు. ఇందులో తప్పేముందండీ. మొగాడన్న ప్రతివాడూ చేసే పనే అది. డబ్బులున్నవాడు చేస్తున్న పనే అది. పెళ్ళాం పతివ్రతగా వుండాలండీ. ఈ మొగుడే ఏడేడు జన్మలకూ కావాలని పూజలూ వ్రతాలూ నోములూ చెయ్యాలండీ. అదే స్త్రీ ధర్మం.

సుందరి చదువుకుంది కదండీ. ఎదురు తిరిగింది. కట్టుకున్నవాడు నాలుగు తన్నాడు. గదిలో పెట్టి తాళం వేశాడు. వేసి, వూళ్ళో వున్న ముండను తీసుకు, మద్రాసెళ్ళాడు సినిమా తియ్యటానికి! ఆ తర్వాత..."

రాజేశ్వరరావు, "ఆ తర్వాత కథ నే చెబుతాను" అన్నాడు.

మధు, "మీ కథ చెబుతారా, సుందరి కథ చెబుతారా?" అడిగాడు.

రాజేశ్వరరావుకు కళ్ళు, మేకను భోంచేసిన పులి కళ్ళలా వున్నాయి.

మందు సీసా ఖాళీ అయింది.

"గురువుగారూ! మీరు పూర్తిగా మందు కొట్టారు నాకు మిగలకుండా! మీ కథ రేపు చెప్పుకుందాం. విశ్రాంతి తీసుకోండి!"

"కూర్చో!" రాజేశ్వర్రరావు గట్టిగా అరిచాడు.

మధు కూర్చున్నాడు.

రాజేశ్వరరావు ఊగిపోతున్నాడు, మందు నిషాతోటీ, ఆవేశం తోటీ...

"మిస్టర్ మధూ! ఆడది అణిగి మణిగి వుండాలి. నా భార్యకు చదువుకున్నానన్న గర్వం, నాకు చదువు అంతగా రాదన్న హేళనభావం వున్నాయి. అంత మాత్రం చేత, నేను నా పెళ్ళానికి చీరలు కొనకుండా, పుట్టింటికి పంపకుండా, సుఖపెట్టకుండా వుండలేను.

నే త్రాగుతాను. దాన్ని త్రాగమనలేదు.

నేను ముండలతో కులుకుతాను. అంతమాత్రాన దాన్ని ముండగాళ్ళకు తార్చలేదే?

అయిందేదో అయిపోయింది. నేను ఓడిపోయాను" రాజేశ్వరరావు సోఫాలో కూర్చున్నాడు.

"గురువుగారూ... మన సినిమా"

"సినిమా... మాయనాకొడుకులు. అంతా కాజేశారు. ఆస్థి పోయింది. డబ్బూ వూడ్చి పెట్టుకుపోయింది."

"మీ ప్రేయసి...."

"ప్రేయసీ అని అనకు బ్రదర్! అది రాక్షసి. రెక్కలొచ్చాయి దానికి. మరొకడితో ఎగిరిపోయింది."

రాజేశ్వరరావుకు మైకం పూర్తిగా కమ్మింది. కూర్చున్నవాడు కూర్చున్నట్టే నిద్రలోకొరిగి పొయ్యాడు.

మధు, అతన్ని పడుకోబెట్టి, తలుపు దగ్గరకేసి వెళ్ళిపొయ్యాడు.

♦ ♦ ♦

తెల్లవారింది.

ఎండ గ్లాస్ విండోస్‌లోంచి మీద పడుతుంటే రాజేశ్వరరావుకు మెళకువ వచ్చింది. లేచి అద్దంలో ముహం చూసుకున్నాడు. చీరేసిన తాటి టెంకలా వుంది ముహం. పెరిగిన జుత్తు, ఎర్రటి కళ్ళు, జిడ్డు కారే ముహం.

సుందరి కబురంపింది.

అలాగే వెళ్ళాడు. ముద్దాయిలా వెళ్ళి నిలబడ్డాడు, సుందరి ముందు.

సుందరి తలారబెట్టుకుంటూ, ఎండపొడన కుర్చీలో కూర్చోనుంది.

"చెప్పండి! ఏదో మాట్లాడాలన్నారు."

రాజేశ్వరరావుకు ఏం మాట్లాడాలో తోచలేదు. క్షణాలు గడుస్తున్న కొద్దీ భయం అవహిస్తున్నది. ఈ సమయం మించిపోతే మళ్ళీ ఇలాంటి అవకాశం రాదేమోనన్న దిగులు.

"నన్ను క్షమించు" అని అన్నాడు తలెత్తకుండానే!

"నాకెప్పుడు, కోపం లేదు ఎవ్వరి మీదా?"

ఇంకేం మాట్లాడాలి?

రాజేశ్వరరావు తలెత్తి ఆమె కళ్ళల్లోకి చూశాడు.

"ఒక్కసారి తప్పటడుగు వేశాను. మంచో చెడో అయిపోయింది. మీదారి మీది. నా దారి ఏనాడో నిర్ణయించుకున్నా" - సుందరి ఓ శుభలేఖ తెచ్చి యిస్తూ, "ఆడది నీళ్ళ లాంటిది. తన వ్యక్తిత్వాన్ని అస్తిత్వాన్నీ త్వరగా కోల్పోతుంది. అది మీరు గ్రహించలేక పోయారు. మళ్ళీ మీరు ఓ ఆడదాని మెళ్ళో మంగళసూత్రం కట్టదల్చుకుంటే ఈ సంగతి గుర్తుంచుకోండి" అని చెప్పి అక్కడి నుంచి వెళ్ళిపోయింది.

రాజేశ్వరరావు శుభలేఖ చూసుకున్నాడు. సుందరి పెళ్ళి ఏనాడో జరిగిపోయింది.

తాను 'లేటు'గా వచ్చాను అనుకున్నాడు - సుందరి ఒకనాటి భర్త రాజేశ్వరరావు. ♦